# అడ్డా

లేబర్ అడ్డా... నగరంలోని నడిబొడ్డు ప్రాంతం. ఆ పట్టణంలోని ఎత్తైన ఖరీదైన భవనాల నిర్మాణానికి, మరెన్నో కూలి పనులకు ఖరీదులేని మనుషులను బేరమాడే స్థలం.... వచ్చేపోయే వాహనాల రొద, హారన్లమోతతో ధ్వని ధ్వనిగా వుంది.... గుడిసె హోటల్లల్లోంచి వస్తున్న చాయ్ వాసన, వాహనాలు లేపుతున్న దుమ్ముమ్మవాసన, విడుస్తున్న పొగ వాసన మిళితమై ఆ ప్రదేశమంతా అదోవాసన వేస్తుంది....

ఉదయం ఎనిమిది గంటల సమయం, తాతల వయసున్నవాళ్ళు, మధ్య వయస్కులు, పడుచువాళ్ళు, అప్పుడప్పుడే నూనూగు మీసాల నూత్న యవ్వనం లోకి ప్రవేశిస్తున్న వాళ్ళు, పదిపన్నెండేళ్ళ పసివాళ్ళు, అన్ని వయసుల ఆడవాళ్ళు ఒక్కొక్కరుగా– గుంపులు గుంపులుగా ఆ ప్రదేశానికి చేరుకుంటున్నారు.... ఆ నగరానికి చుట్టుప్రక్కలున్న పది కిలోమీటర్ల దూరంలో వున్న గ్రామాల్నుంచి, ఆ నగరంలోని మురికి వాడల్నుంచి నాలుగేళ్ళ నోట్లోకెళ్ళే కూలిపని వెతుక్కుంటూ అక్కడి కొస్తున్నారు వాళ్ళు.... వాళ్ళ శరీరాలపై నిక్కర్లు, పాంట్లు, పంచెలు, చీరలున్నాయి. కాని ప్రతివాళ్ళు తొడుక్కున్న బట్టలకూ చినుగులున్నాయి. అందులో కొందరి కంగీలు లేవు.... కొందరికి మాసికలు పడ్డ జాకెట్లున్నాయి. వాళ్ళలో చాలా మంది తలలకు నూనె లేదు.... వాళ్ళ కళ్ళు లోతుకు ఈడ్చుకుపోయున్నాయి.... ముఖాలెండి పోయున్నాయి.... ఎవరి ముఖంలోనూ కళ లేదు.... కాని ఆ రోజు కూలి దొరుకుతుందో, దొరకదో అన్న ఆందోళన ఉంది.... వాళ్ళ డొక్కల్లోతుకు పోయున్నాయి.... కాళ్ళు పగుళ్ళు బట్టున్నాయి వాళ్ళలో చాలా మంది కాళ్ళకు చెప్పుల్లేవు.... వాళ్ళ శరీరాలపై చటాకు మాంసం లేక బక్కచిక్కున్నారు.... వాళ్ళందరి శరీరాలపై చెమట వాసనుంది....

తొమ్మిది గంటలయేసరికి అందరూ అక్కడికి చేరుకున్నారు.... వాళ్ళందరి చేతుల్లో అల్యూమినియం డబ్బాలున్నాయి.... అందులో చద్దన్నముంది.... వాళ్ళలో కొందరు మెక్కిచుట్టలు ముట్టించారు.... కొందరు క్రిష్ణబీడీలు, గణేష్‌బీడీలు వెలిగించారు.... కొందరు పొగాకు చుట్టలంటించారు....అక్కడి గాలి వాహనాలొదిలే పొగ లేపే దుమ్ము, బీడీ చుట్టల పొగలతో నిండి గెదడు గెదడు వాసనేస్తుంది.... ఆ వాసన సున్నిత శరీరులకు, సుఖంగా బ్రతికిన వాళ్ళకు వాంతి తెప్పిచ్చేదిగా వుంది....

అక్కడ బేరాలు జరుగుతున్నాయి. కూలీల బేరాలు జరుగుతున్నాయి....కండబట్టిలేని ఆ కూలీలను కండబట్టున్న తెల్లబట్టల మనుషులు తమ తమ పనుల కోసం బేరమాడుతున్నారు. బిల్డింగులు కాంట్రాక్టులు పట్టి పనిచేసే మేస్త్రీలకు రోజా

పనులకెళ్ళే కూలీలు వాళ్ళు చెప్పిన చోట్లకు పనులకెళ్తున్నారు. మిగతావాళ్ళు, తెల్లబట్టలువాళ్లు కనబడితే చాలు చుట్టూ మూగుతున్నారు.... "కూలీలు కావాలా సార్.... మేం పని కొస్తాము...." అని చుట్టుముడుతున్నారు. వాళ్ళ నిస్సహాయతను ఆసరాగా చేసుకొని తక్కువ కూలీకి పిలుస్తున్నారు వాళ్ళు.... పోయే వాళ్ళు పోతున్నారు.... మరీ తక్కువనిపించిన వాళ్ళు మరొకరి కోసం ఎదురు చూస్తున్నారు.... పని చేసీ చేసీ బక్కచిక్కున్న ఆ కూలీల్లోంచి కొంచెం దృఢంగా ఉన్నవాళ్ళను కొంచెం బేరమాడుకొని తీసుకెళ్తున్నారు.... సమయం గడుస్తున్న కొద్దీ పనులు దొరుకని కూలీల ముఖాల్లో ఆందోళన పెరుగుతుంది.... పని లేకుంటే, దొరకని ఆ రోజు తిండి కోసం ఆరాటం పెరుగుతుంది.... అంత దూరం నుంచి వచ్చిన తమ శ్రమ వృధా అవుతుందేమోనన్న భయం పెరుగుతుంది.... ఆ రోజు కూలి దొరుకదేమోనని భయపడి కొందరు తక్కువ కూలీకి పనులకెళ్తున్నారు.... ఎవరైనా స్కూటర్ పైన్నో, మోపెడ్ పైన్నో, సైకిల్ పైన్నో వస్తే చాలు.... "ఎంత మంది కావాలి సార్...." అని "మేం వస్తాం సార్...." అని వెంబడి పడ్తున్నారు.... అయినా అందరికీ కూలీ దొరకడం లేదు.... పదిగంటలు సమయమయ్యేసరికి స్కూటర్ల వాళ్ళు, మోపెడ్ల వాళ్ళు, సైకిళ్ళవాళ్ళు, మేస్త్రీ లంతా వెళ్ళిపోయారు.... అక్కడికి పని వెతుక్కుంటూ వచ్చిన వాళ్ళలో సగం మంది మిగిలిపోయారు....

వాళ్ళ ముఖాల్లో రక్తం లేదు.... కరచరణాల్లో సత్తువ లేదు.... మనసులో సంతోషం లేదు.... కాని, వాళ్ళ కళ్ళల్లో నీళ్ళున్నాయి.... కడుపులో దుఃఖముంది శరీరంపై చెమటుంది.... పేగుల్లో ఆకలుంది.... పని లేక అంతదూరం ఖాళీ చేతులతో తిరిగి వెళ్ళడానికి బాధపడ్తున్నారు వాళ్ళు.... ఆరోజు కూలి దొరికితే వచ్చిన డబ్బుతో నూకలైనా కొనుక్కుందామని వచ్చిన ఆ బడుగు జీవులు ఆరోజు తిండి గూర్చి ఆందోళన చెందుతున్నారు.... గుంపులు, గుంపులుగా చేరి నిరాశ, నిస్పృహలతో మాట్లాడుకుంటున్నారు వాళ్ళు....

"ఇయ్యాల్ల కూడ పని దొరుకక పాయె.... ఇంట్ల నూకలు గూడ లెవ్వు."

"నా బిడ్డకు జెరమత్తంది.... డాకుటరు దగ్గరికి తీసుక పోదామంటె పైసల్లేవు.... నిన్న పన్దొరుకలే....ఇయ్యాల్లదొరుకలే.... ఇగెట్ల బతుకుడో ఏమొ?"

"కోమటటనె ఇగేం సామానియ్య నంటండు....ఖాత యాభైరూపాయ లయనయి.... కూలి ఓనాడు దొరుకతె ఓనాడు దొరుకకపాయె.... ఇంట్ల ఒక్క నూనె బొట్టన్న లేదు...."

తమ ఆర్థిక ఇబ్బందుల గూర్చి, అవసరాల గూర్చి గ్యారంటీ లేని రోజుకూలీ గూర్చి మాట్లాడుకుంటూ ఎలా బ్రతకడమో అని బ్రతుకు భయాన్ని వ్యక్తం చేస్తున్నారు వాళ్ళు....కొద్దిసేపు చూసి ఇక ఆరోజు పని దొరుకదని నిర్ధారణ చేసుకొని తమ తమ ఇండ్లకు కాళ్లీడ్చుకుంటూ వెళ్ళడానికి ఉద్యుక్తులవుతున్నారు వాళ్ళు....

వాళ్ళను, వాళ్ళ ఆరాటాన్ని చూస్తూ వాళ్ళ మాటలు వింటూ, వాళ్ళ స్థితిగతులను అర్థం చేసుకుంటూ ఇద్దరు వ్యక్తులు రెండు గంటల్నుంచి ఆ లేబర్

అడ్డా అంతా తిరుగుతున్నారు.... అందులో ఒకతను యూనివర్సిటీ ప్రొఫెసర్.... డాక్టర్ మూర్తిగారు.... అతనికి గొప్ప మేధావన్న పేరుంది.... కావల్సినంత పుస్తక పరిజ్ఞానముంది.... తెలుగు సాహిత్యంలో 'అస్పృశ్యత' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పుచ్చుకున్నారాయన.... ఆయన తన సిద్ధాంత వ్యాసంలో కొత్త కొత్త సిద్ధాంతాలను లేవదీసారు.... అస్పృశ్యులు వాళ్ళకు వాళ్ళే శత్రువులని, వాళ్ళ అజ్ఞానమే వాళ్ళనలా వుంచుతుందని, దానికెవరి బాధ్యతా లేదని తీర్మానించారు. పరిస్థితులు తరిమివేస్తే కాక సుఖపడటానికే బాధ్యతలు తప్పించుకొని గ్రామాల్లో వ్యవసాయాలు వదులుకొని బొగ్గుబావుల్లో కార్మికులుగా పనిచేయడానికి పోతున్నారని ఆయనగారి అభిప్రాయం.... కార్మికులు, కర్షకులు, కూలినాలి జనాల గురించి రాసే సాహిత్యంలో శిల్పముండటం లేదని, సాహిత్యంలో విషయం కన్నా శిల్పమే ప్రధానమని అతని దృఢవిశ్వాసం .... అతడెన్నో పుస్తక సమీక్షలు రాసాడు.... కావల్సినంత సాహిత్య విమర్శ చేసాడు.... విమర్శకుడిగానేకాక రచయితగా కూడా పేరు తెచ్చుకున్నాడు.... ఎంతో మంది పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించి డాక్టరేట్ డిగ్రీ ఇప్పించాడు.... మంచి పాలనాదక్షుడు, విమర్శకుడు, రచయిత, మేధావియైన ప్రొఫెసర్ మూర్తిగారి సేవలను ప్రభుత్వం కూడా అప్పుడప్పుడు వినియోగించుకుంటుంది.... ఈ మధ్యనే అతడు ప్రభుత్వ కోరికపై రాష్ట్రంలో తీవ్రతరమవుతున్న తీవ్రవాద సమస్యపై రిపోర్ట్ తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాడు.... ఆ రిపోర్టులో ప్రజలు వాళ్ళకు సహాయం చేయడం కేవలం భయంతోనేనని, ఆ సమస్య కేవలం శాంతిభద్రతల సమస్యేనని, దానికి మార్గం క్రూరంగా అణచివేయడమేనని, వాళ్ళకు ప్రజల్లో పెద్దగా సపోర్టు లేదని వివరించాడు.

డాక్టర్ మూర్తిగారితోపాటున్న ఇంకో వ్యక్తి యువ జర్నలిస్టు, పేరు విజయ్.... డబ్బుకో, పలుకుబడికో, రాజకీయాల ఒత్తిళ్ళకో అమ్ముడుపోయి రిపోర్టులు రాసే కొందరు జర్నలిస్టుల్లా కాకుండా నిష్పక్షపాతంగా రిపోర్టులు రాస్తాడతను. ప్రజల పక్షం వహించి ఎన్నో కంభకోణాలను వెలికితీసాడు.

వాళ్ళిద్దరు కలసి ఓ ముసలాయన దగ్గరికెళ్ళారు. కడుపు వెన్నుకంటుకు పోయి చీకిపడేసిన మామిడి పిక్కలా వున్నాడతను. నిరాశతో కూలి దొరకలేదని విచారిస్తూ పోబోతున్న ఆ వృద్ధుడు తన దగ్గరి కొచ్చిన తెల్లబట్టల సార్లను చూసి ఆశతో ముఖంలో వెలుగు నింపుకున్నాడు.

"ఏమన్నా పనుందా సార్? ఎంత మంది కావాలె." అన్నాడు.

మూర్తిగారు, విజయ్ ఏం మాట్లాడలేదు. కొద్ది క్షణాలాగి–

"తాతా! నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు విజయ్.

పని దొరుకుతుందనుకున్న ఆ వృద్ధుడికా మాటలతో పని దొరకదని అర్ధమయింది. ముఖం వాడిపోయింది.

"ఏం మాట్లాడుతారు సార్....? మీరే మన్న అర్సెటోల్లా, తీర్సెటోల్లా?" అని పోబోయాడు వృద్ధుడు.

"తాతా....అట్లాగు–" అని అతని చేతిలో పది రూపాయలుంచాడు విజయ్.

"ఏంది సార్....వట్టిగ మాట్లాడుతనని పైసలిస్తండ్రు........ సరె, ఏం మాట్లాడుతరో మాట్లాడుండి...." అన్నాడు.

"నీ వయసెంతుంటుంది...." అడిగాడు మూర్తిగారు–

"అరవై దాటింది...."

"అయినా ఈ కూలి పని కెందుకొస్తున్నావు....?" విజయ్.

"రాకుంటె ఎట్లెల్లుతదీ సార్....?"

"నీకు కొడుకుల్లేరా....?" విజయ్.

"ఉన్నారు....నలుగురు...."

"వాళ్ళు నిన్ను పోషించటం లేదా?" అన్నాడు మూర్తిగారు....

"ఎందుకు సాదరు సార్....? కాని వాళ్ళకే లేకుంటె నాకేం బెడతరు....? ఇద్దరు పాలేర్లున్నరు....ఇద్దరు కూలిపని చేసుకుంట బతుకుతండ్రు. పొద్దుందాక, తెల్లందాక పన్జేసినా అల్ల కడుపులే నిండుత లెవ్వు.... అల్లు, అల్లపిల్లగాండ్లు బతుకంగింకేం మిగుల్తయి? అల్ల సంగతి జూసుకుంటనే అల్ల మీదెట్లాధారపడి బతుకాలె సార్....? నాయన్నా, పనికి పోకు అని మా అంటరాల్లు....కని అరిగోస పడుకుంట బతికెటోల్లం జూసుకుంటనే కూసుండి తినన్నంటె మంచిగనిపియ్యది. పురాగ సాతగాకుంటయితె, మంచంల పడితె అల్లు సూసుకునుండు ఎట్లయిన తప్పది...." అన్నాడా వృద్ధుడు.

"మీ ఊరిక్కడికి ఎంత దూరం?" విజయ్.

"ఐదు మైళ్ళుంటది సార్!"

"అంటే రోజూ ఇంత దూరం వచ్చి, రాత్రి పోతావన్నమాట."

"మా ఊర్నుంచి రోజూ సద్దులు గట్టుకొని యాబయిమంది వస్తము, రోజూ పదిరువై మంది, ఒనాడోనాడు సగానికంటెక్కువే తిరిగి పోతం.... అందరికి పనిదొరికే దినాలు తక్కువే ఉంటయి...."

పిడికెడు మెతుకులకోసం విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో కష్టపడుతున్న ఆ వృద్ధుని చూసిన వాళ్ళకు బాధ కల్గింది.

"సరే తాత .... నువ్వెళ్ళిపో...." అని మరో పది రూపాయలిచ్చాడు విజయ్.

వాళ్ళను కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ వంగి వంగి దండాలు పెట్టుకుంటూ వెళ్ళిపోయాడా వృద్ధుడు.

కూలి దొరకక వెళ్ళిపోతున్న బాలింతరాలి దగ్గరి కెళ్ళారు వాళ్ళు. మూన్నెల్ల శిశువు నెత్తుకొనుందామె.... ఇంకా ఆమెలో పురుటి వాసన పోనేలేదు. అలాంటి స్త్రీ కష్టమైన పని చేయడానికి రావడం మూర్తిగారి కాశ్చర్యంగా వుంది.

"కొద్దిసేపు నీతో మాట్లాడాలి.... " అన్నాడు విజయ్ ఆమెతో.... ఆమె వాళ్ళ ననుమానంగా చూసింది.

"నీ రోజు కూలెంతో ఇస్తాం. మే మడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పాలంతే...."

కూలనగానే ఆమె ముఖం వికసించింది.

"నీ రోజు కూలెంత....?" అడిగాడు విజయ్.

"మేస్త్రీ కింద రాతం (రోజు) బోతే పన్నెండు రూపాయలు. రోజా కూలయితే పదమూడు" అందామె.

పదమూడు రూపాయలామె చేతిలో పెట్టాడు విజయ్.

"నువెక్కడనుంచి వచ్చావు పనికి?"

"మాదిదువరుకో పల్లెటూరుండె.... నాలుగేండ్లామె ఇక్కన్నే అచ్చి ఉంటన్నం.... కార్ఖానగడ్డకో గుడిసేసుకున్నం.... కూలి పన్జేసుకుంట బతుకుతన్నం...."

"మీ అయనేం జేస్తండు?"

"రిక్షా తొక్కుతడు సార్...."

"అంత చిన్న పాపను పట్టుకొని పనెలా చేస్తావు? నువ్వు పన్జేసేప్పుడు పాపెక్కడుంటుంది?"

"దగ్గర్నే పండుకోబెడ్త.... చిన్న పొల్లం దీసికొని పనికెందు కచ్చినవని మేస్త్రీ బూతులు తిడుతనే వుంటడు. కనేం జేసుడు సార్....? ఇంట్లుంటె ఎల్లుతదా....? ఐదుగురు పిల్లగాండ్లు.... అల్లం చేదుకోవన్నంటె ఒక్కని పనితోనేం జరిపోతది? పన్జేసేటప్పుడు మనుసంత పొల్లమీదనే ఉంటది.. ..గింత పసి పొల్లను పట్టుకొని పనికి రావన్ననుంటదా? కని ఏం జేసుడు సార్? ఎల్లక...."

"మేస్త్రీలు, యజమాన్లు మీ తోని మర్యాదగా ప్రవర్తిస్తారా....?"

ఆమె ముఖం మాడిపోయింది.

"మాకు మర్యాదిచ్చెటోల్లెవ్వలు సార్....? అందరు రాయే పోయే అనే పిలుత్తరు....గా సంగతులన్ని ఎట్లు జెప్పాలె సార్....?"

"పురుటి వాసనయినా పోలేదు....నీకు పనెలా చేతనవుతుంది?"

"సాతగాకుంటే ఎవ్వలకోసం సార్? పొట్ట తిప్పలకు జెర్రిపోతులాటన్నరు. సాతగాదని ఇంట్ల గూసుంటె కడుపెట్ల నిండాలె సార్....? ఇంట్ల ముసలోల్లు గిట్ట ఉంటె పొల్లగాండ్లను అల్లకిచ్చి వత్తం. అయినా మా ఇండ్లల్ల పురాగ సాతగాకుంటాయెరాక పనికి పోవుడే. సానమంది సంకల పిల్లల నెత్తుకొనే అత్తరు."

మరికొన్ని నిముషాలామెతో మాట్లాడి వెళ్ళిపొమ్మన్నారు. ఇంతవరకు కూలి కోసం ఎదురు చూసే జనంతో సందడిగా వున్న ఆ లేబర్ అడ్డా పలుచబడింది. చాలామంది వెళ్ళిపోయారు. ఇంకొందరు మిణుకు మిణుకు మంటున్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

మీసం కట్టయినా మొలవని, ముక్కు పచ్చలారని ఓ పది పన్నెండేండ్ల పసివాని దగ్గరికెళ్ళారు వాళ్ళు. ఆ బాబు చేతిలో పది రూపాయలు పెట్టాడు విజయ్.... సంతోషపడుతూ నిక్కరు జేబులో పెట్టుకున్నాడా డబ్బును వాడు.

అతని చేతిలో నున్న డబ్బగిన్నె మూత తియ్యమన్నాడు విజయ్. మెరిగెలు, ఒలిపిళ్ళతో కూడుకొనున్న నూకల బియ్యపన్నం, పచ్చిమిరపకాయ కారమున్నా యందులో. ఆ అన్నం చలిమిడిలా వుంది. మెత్తపడి, ఔరుడుగా వుంది. వాసనేస్తుంది.

ఆ అన్నాన్ని చూసి ముఖం ఇటు తిప్పుకున్నాడు మూర్తిగారు. బాబు ఆ గిన్నె మూతపెట్టి చేతిలో పట్టుకున్నాడు.

"నువ్వెక్కన్నుంచి వచ్చావు బాబూ?" అడిగాడు విజయ్.

"మల్యాల నుంచచ్చిన సార్........ ఇక్కడికి పది కిలో మీటర్లుంటది."

"నడ్చుకుంట వచ్చినవా?"

"సైకిల్ మీదచ్చిన .... మా ఊళ్ళె నుంచి రోజు ఇరువై, ముప్పై మంది వస్తము సైకిల్ మీద...."

"రోజు పని దొరుకుద్దా?"

"ఓనాడు దొరుకుద్ది.... ఓనాడు దొరుకద్ది...."

"మరి నువ్వెందుకు బడికి పోవడం లేదు. ఇంత చిన్న వయసులో ఏం పన్జేస్తావు....?"

"కొన్నొద్దులు మాపెయినా సార్.... కని ఇంట్లెల్లలే. మా నాయన్న ఊళ్ళె బాయిలు తవ్వుతడు. మా అవ్వ కలువ, కొయ్య, నాటేసుడు సొంటి పనులకు పోతది. ఎల్లకనే సదువు బందు జేసిండు మా నాయన్న. నాకు పదేండ్లు దాటినయి. నాకంటె చిన్నోల్లు గూడ మా ఊళ్ళె నాగలి దుంతరు. అన్ని పనులు జేత్తరు. నాకు పనిరాదనుకుంటండ్రా సార్.... పెద్దోల్లకంటెక్కో పన్జేత్త."

ఆరిందా వయసుకుమించి మాట్లాడే ఆ బాబు మాటలు వాళ్ళకాశ్చర్యం కలిగించాయి.

"మరి నీకు చదువుకోవాలని లేదా?"

"చదువుకోవాలనెందుకుండది సార్? మా ఉంది.... కని ఏం లాభం సార్-? మా ఇంటోల్లమంత పన్జేత్తనే ఉంటం. అయినా సరిపోతలెవ్వు - ఇగెట్ల సదువుకునుడు మరి....?"

ఇచ్చే కూలి గురించి, అతడు చేసే పని గురించి మరికొద్దిసేపు మాట్లాడి అతన్ని పంపించారు.

నడుం వంగి చేతగాకుంటున్నా తన కొడుకులకు భారం గావద్దని పని వెతుక్కుంటూ వచ్చిన వృద్ధురాలితో, వయసును మించిన వృద్ధాప్యాన్ని మోస్తున్న నడివయసు కూలివాళ్ళతో, పనిభారంతో కృంగిపోతూ కడుపుకైనా నింపుకోలేనివాళ్ళతో కలిసి మాట్లాడారు ఇద్దరు.... మరి కొద్దిసేపక్కడ తిరిగారు. సమయం పదకొండు గంటలవుతుంది. ఆ ప్రదేశమంతా ఖాళీ అయింది. చుట్లల వాసన, బీడీల వాసన, కూలీల ఎదురు తెన్నులు మాయమయ్యాయి - వచ్చీ పోయే వాహనాల రొద, అవి విడుస్తున్న పొగ వాసన మాత్రమే వున్నాయి. టీ కొట్లలోనూ సందడి తగ్గింది.

మూడు గంటలుగా ఆ ప్రదేశమంతా తిరిగి పరిస్థితులను స్వయంగా అవగాహన చేసుకున్న డాక్టర్ మూర్తిగారి మనసు వికలమయింది. వాళ్ళ పరిస్థితుల నంత దగ్గరగా చూసిన అతని హృదయం అల్లకల్లోల మయింది. తానింత వరకు రాసిన రాతల గూర్చి, యిచ్చిన రిపోర్టులు గూర్చి ఆత్మ విమర్శ చేసుకుంటున్నాడతను.

మూర్తిలో జరుగుతున్న అంతర్మథనాన్ని అతని ముఖంపై చదివిన విజయ్ అతనితో ఏం మాట్లాడకుండా తన స్కూటర్‌పై ఇంటికి తీసుకెళ్ళాడు. కొద్దిసేపాగి ఇద్దరు భోజనాలు చేసారు. డ్రాయింగ్ రూంలో కూర్చున్నారు.

"సార్.... ఈ రోజు మనం చూసిన విషయాలన్నీ మీకు తెలియనివేం కావు. రోజూ మీరు చూస్తున్నవే. అయితే, వాళ్ళ పరిస్థితుల నవగాహన చేసుకోవాలన్న దృష్టితో కాకుండా రొటీన్ జీవితంతో చూస్తున్నవి. కాటికి కాళ్ళు చాపుకొని హాయిగా విశ్రాంతి తీసుకోవాల్సిన వృద్ధులు, ఆడుతూ పాడుతూ పాఠశాల కేగాల్సిన వయసుగల పసివాళ్ళు, పురిటివాసన్తో పనికొచ్చే స్త్రీలు ఇంకా ఎంతో మంది కేవలం పొట్టకూటికోసం పని రాక్షసికి బలికాక తప్పడం లేదు సార్! పని చేద్దామన్నా అందరికీ దొరకడం లేదు. పని దొరికినా వాళ్ళపై ఎన్నో రకాల దోపిడీ–కాంట్రాక్టర్, యజమాని, మేస్త్రీ, పనిగంటలు... పట్టణాల్లో పరిస్థితే ఇలా వుంటే పల్లెల్లో పరిస్థితి మరింత దారుణంగా వుంది. పరిస్థితులిలా వుంటే పనులు చెయ్యడం ఇష్టం లేకనే బిచ్చగాళ్ళుగా మారుతున్నారంటారు కొందరు మేధావులు.... వాళ్ళందరికీ పని కల్పించగలరా ఎవ్వరైనా....?" అన్నాడు విజయ్.

మూర్తిగారిలో అంతర్మథనం సాగుతుంది.

"రిపోర్ట్‌లు సమర్పించే వాళ్ళు, రచయితలు చాలామంది కారణావేవైనా పట్టణాల్లో స్థిరపడ్డవాళ్ళు... వాళ్ళు మేధావులే కాని, వాళ్ళకు పల్లెలతో సంబంధాలు చాలావరకు తెగిపోయాయి. పుస్తక పరిజ్ఞానంతో, లోతులు, కారణాలు తెలుసుకోకుండానే రాస్తారు. సమీక్షలు చేస్తారు. పల్లెల గూర్చి రాస్తున్న కొందరు పల్లెపట్టుల ప్రకృతి సౌందర్యాల గూర్చి పచ్చని పొలాల గూర్చి సాంప్రదాయ సిద్ధంగా రాస్తున్నారు. కాని, మారుతున్న సంబంధాల గూర్చి, సంఘర్షణల గూర్చి రాయడంలేదు. అలా రాసేవాళ్లు అతి తక్కువ. అలాంటివాళ్ళ గూర్చి వచ్చే సాహిత్యంలో శిల్పం లేదంటున్నారు. ఇలాంటి సాహిత్యంలో సహజంగానే హాట్ కేకుల్లా అమ్ముడుబోయే దేశ కాల పరిస్థితులకు సంబంధం లేని నవలల్లోలాగా శిల్ప ముండదు. కాదంటారా – ?" అన్నాడు విజయ్.

అంగీకార సూచకంగా తలూపాడు మూర్తిగారు.

"హరిజనుల వెనుకబాటు తనానికి కారణం వాళ్ళ అజ్ఞానమే అని రాసారు మీరు .... కాని దానికి వెనుకవున్న కారణాల గూర్చి చెప్పలేదు. బ్యాక్ గ్రౌండ్ శక్తుల గూర్చి చెప్పలేదు. వ్యవసాయాలు చేయడం ఇష్టం లేకనే సుఖపడడానికి వ్యవసాయాలొదిలి కార్మికులుగా వెళ్తున్నారని రాసారు మీరు.... కాని వ్యవసాయాల వల్ల పొట్టలునిండక మాత్రమే వాళ్ళు బతుకు తెరువు వెతుక్కుంటూ వెళ్తున్నారన్నది నిజం .... సార్ .... దేశంలో దుర్భర దారిద్ర్యముంది. ఆకలి చావులున్నాయి, మెజారిటీ ప్రజలపై వివిధ రకాల దోపిడీ కొనసాగుతుంది. ఇవి చేదు నిజాలే అయినా కఠోర వాస్తవాలు. ప్రవాహంలో కొట్టుకు పోతున్న వాడికి చిన్న ఊతం దొరికినా దాని సాయంతో ఒడ్డు చేరుకోవడానికి ప్రయత్నిస్తాడు. మండుటెండల్లో మాడిపోతున్నవాడికి చిన్న చెట్టు నీడైనా ఎంతో హాయినిస్తుంది. ఆకలి మంటలతో

అలమటిస్తున్నవాడు గంజినీళ్ళు లభించినా ఎంతో సంతోషిస్తాడు. అందుకే తమ సమస్యల గూర్చి చెప్పి వాళ్ళకోసం ఎంతో కొంత చేస్తున్న అన్నలు, ప్రజ లకు ఆప్తుల్లా కనిపించారు. విషయాన్ని సామాజిక దృక్కోణం నుండి కాకుండా కేవలం శాంతి భద్రతల సమస్యగా గణిస్తే పరిష్కారం సాధ్యం కాదు. తీవ్రవాదం తలెత్తడానికి గల కారణాలను తెలుసుకొని పరిష్కారాలను వెదకాలి.... మీ మనసుకేమైనా నొప్పి కల్గిస్తే క్షమించండి...." అన్నాడు విజయ్.

"నో....నో.... నాకు వాస్తవ పరిస్థితి అవగాహన కావడానికి నాకీ రోజెంతో ఉపయోగపడింది. నా వచ్చే రచనల్లో ఈ రోజు ప్రభావం తప్పకుండా ఉంటుంది" అని లేచాడు మూర్తిగారు.

సిటీ కెళ్ళే బస్సెక్కించడానికి ప్రొఫెసర్‌గార్ని తీసుకొని బస్టాంగు కెళ్ళాడు విజయ్.

● *ప్రజాసాహితి, నవంబర్, 1994* ●

★ ★ ★